



మువ్వన్నెల రెపరెపలు

అమలాపురంలో వందలాది మంది విద్యార్థులతో 500 మీటర్ల జాతీయ పతాకంతో తిరంగా యాత్ర

స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో తిరంగా యాత్రను అమలాపురంలోని విద్యానిధి విద్యా సంస్థల ప్రాంగణం వద్ద చైర్మన్ ఏబీ నాయుడు మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. వందలాది మంది విద్యార్థులు 500 మీటర్ల జాతీయ పతాకంతో మెయిన్‌రోడ్డు మీదుగా ఊరేగుతూ గడియార స్తంభం సెంటరుకు చేరుకున్నారు. అక్కడి నుంచి తిరిగి విద్యా సంస్థల ప్రాంగణానికి వచ్చారు. ర్యాలీలో విద్యానిధి ఐఐటీ టాలెంట్ స్కూలు, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

- అమలాపురం టౌన్







ఫల, పుష్పాలతో ఆలయాన్ని అలంకరిస్తున్న దృశ్యం





వేంకటేశ్వర స్వామి నిజరూప దర్శనం

శ్రీవారి పవిత్రోత్సవాలకు వాడపల్లి ముస్తాబు

ఆత్రేయపురం, ఆగస్టు 13: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం పవిత్రోత్సవాలకు ముస్తాబైంది. తిరుమల తరహాలో మూడు రోజుల పాటు వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ఘనంగా నిర్వహించనున్నారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వసంత మండపంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేస్తారు. సుగంధ పరిమళాలు వెదజల్లే ఫల, పుష్పాలతో ఆలయాన్ని సర్వాంగసుందరంగా అలంకరిస్తున్నారు. వసంత మండపం, ప్రాకార మండపం, ధ్వజస్తంభం, అంతరాలయం, ఆలయ ముఖద్వారాలను శోభాయమానంగా తీర్చిదిద్దారు. బుధవారం నుంచి శుక్రవారం వరకు స్వామివారి సంకీర్తనల ఆలాపనతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుపుతారు. ఈ మూడు రోజుల పాటు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలను రద్దు చేశామని, ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నామని ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు. మంగళవారం తిరుమంజన సేవ నిర్వహించగా స్వామివారు నిజరూప దర్శనంలో భక్తులకు దర్శనమిచ్చారు.



రెవెన్యూ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

16 నుంచి సెప్టెంబరు 30 వరకు రెవెన్యూ సదస్సులు

- గ్రామాల వారీగా నిర్వహణకు ప్రణాళికలు
- రెవెన్యూ రికార్డులను సిద్ధం చేసుకోవాలి: కలెక్టర్

అమలాపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 16 నుంచి సెప్టెంబరు 30 వరకు గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సుల నిర్వహణకు ఆదేశించినట్టు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. ఇందుకు రెవెన్యూ యంత్రాంగం సమాయత్తం కావాలని తహసీల్దార్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో మంగళవారం జాయింట్ కలెక్టర్ టి.నిషాంతితో కలిసి కలెక్టర్ రెవెన్యూ సదస్సుల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఏ గ్రామంలో ఏ తేదీన సదస్సు నిర్వహించేదీ ముందుగా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ప్రధానంగా మ్యూటేషన్, భూ తగాదాలు, వెబ్‌ల్యాండ్‌లో కరక్షన్లు, 1(బి), దారి సమస్యలు ఎక్కువగా ఉంటాయన్నారు. వీటి పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని, అవసరమైన రికార్డులను అధికారులు సిద్ధం చేసుకోవాలన్నారు. 22(ఎ), ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి అన్ని విషయాలను పరిశీలించి సంబంధిత రికార్డులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు, సచివాలయ స్థాయిలో గ్రామ సభలు నిర్వహించి రైతుల సమస్యలను 45 రోజుల్లో అర్జీల రూపంలో తీసుకోవాలన్నారు. సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టి మరో 45 రోజుల్లో పరిష్కరించాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో మండల సర్వేయర్, దేవదాయ, వక్ఫ్‌బోర్డు, రిజిస్ట్రేషన్, అటవీ శాఖల అధికారులు కూడా పాల్గొంటారన్నారు. ప్రతి మండలానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించడంతో పాటు ఆర్డీవోలు వారివారి డివిజన్ల పరిధిలో మండలాల్లో జరిగే సదస్సుల నిర్వహణను పర్యవేక్షించాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రజా ప్రతినిధులను కూడా భాగస్వాములను చేయాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభిస్తుందని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో అమలాపురం, కొత్తపేట, రామచంద్రపురం ఆర్డీవోలు జి.కేశవర్ధనరెడ్డి, జీవీవీ సత్యనారాయణ, ఎస్.సుధాసాగర్, సర్వే శాఖ సహాయ సంచాలకుడు ప్రభాకరరావు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

'ఉపాధి హామీ' కింద జిల్లాకు 56 లక్షల పని దినాలు

అమలాపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఉపాధి హామీ పథకం కింద జిల్లాకు 56లక్షల పని దినాలకు అనుమతి లభించిందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. జిల్లాలో 1,620 ఎకరాల్లో ఉద్యానవన పంటల ప్లాంటేషన్ ఉపాధి హామీలో చేయడం లక్ష్యంగా నిర్దేశించారని వివరించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఉపాధి హామీ పనులను లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఉపాధి హామీ పథకం పనులపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. గోకులం షెడ్లు, గొర్రెల షెల్టర్లు, పౌల్ట్రీ షెల్టర్లు 1,075 నిర్మించాల్సి ఉందన్నారు. మెటీరియల్ కాంపోనెంట్ కింద జిల్లాకు రూ.100 కోట్లు వచ్చే అవకాశముందని తెలిపారు. గత ఏడాది చెల్లించాల్సిన బకాయిలు పోను సుమారు రూ.50 కోట్ల మెటీరియల్ కాంపోనెంట్ పనులకు నిధులు మిగులుతాయన్నారు. సమావేశంలో డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి బీవీ రమణ, ఇరిగేషన్, డ్రైయిన్స్ శాఖల అధికారులు, ఎంపీడీవోలు, ఏపీవోలు, ఏపీడీలు పాల్గొన్నారు.



ఉపాధి హామీ పనులపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

చేప పిల్లల కోసం ఎక్కడికి పోయేది...!

ఐదేళ్లుగా పనిచేయని పెంపకం కేంద్రాలు

నిరుపయోగంగా పెంపకం తొట్టెలు



ఐదేళ్లుగా ఖాళీగా ఉన్న చేప పిల్లల పెంపకం తొట్టెలు

నాడు కళకళ...

నేడు వెలవెల

అమలాపురం రూరల్, ఆగస్టు 13: మత్స్య సంపదకు దేశీయంగా మార్కెట్‌లో మంచి డిమాండు ఉంది. మార్కెట్‌లోకి చేపలు రావాలే గానీ హాట్ కేకుల్లా అమ్ముడుపోతున్నాయి. మత్స్య సంపదను వృద్ధి చేయండి.. మత్స్యకారుల జీవనోపాధిని పెంచండి అంటూ గత వైసీపీ పాలకుల మాటలు మాత్రం కోటలు దాటాయి. మత్స్య సంపదను వృద్ధి చేసేందుకు మత్స్యకారులు పడుతున్న కష్టాలు మాత్రం జగన్ ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవు. గ్రామీణ ప్రాంతాల్లోని పంచాయతీల చెరువుల్లో చేపల పెంపకం ద్వారా మత్స్యకార సొసైటీలు జీవనోపాధి పొందుతుంటే పంచాయతీలకు ఆదాయం సమకూరుతుంది. ఇది దశాబ్దాల కాలంగా జరుగుతున్న ప్రక్రియ. పంచాయతీ చెరువుల్లో చేపల పెంపకానికి అవసరమైన చేప పిల్లల లభ్యత లేకుండా జగన్ ప్రభుత్వం చేసేసింది. దాంతో జిల్లాలోని మత్స్యకార సొసైటీల ప్రతినిధులు చేప పిల్లల కోసం జిల్లాలు దాటి వెళ్లి మరీ ప్రైవేటు వ్యాపారుల నుంచి కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని చేప పిల్లల పెంపకం కేంద్రాలన్నింటినీ వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చేప పిల్లల పెంపకం కేంద్రాలను పునరుద్ధరించే దిశగా చర్యలు చేపడుతుండడంపై మత్స్యకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


జిల్లాలోని చేప పిల్లల పెంపంకం కేంద్రాల వద్ద సిమెంటు తొట్టెలన్నీ గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో చేప పిల్లలతో కళకళలాడగా నేడు నిరుపయోగంగా మారాయి. అమలాపురం, మామిడికుదురు, కొత్తపేట, రాజోలు, ద్వారపూడి కేంద్రాలుగా చేప పిల్లల సరఫరా నిరంతరాయంగా జరిగేది. ఒక్క అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లిలోని మత్స్య శాఖ కార్యాలయం వద్ద తొట్టెల్లో సీడ్ ద్వారా పెంచిన చేప పిల్లలను ఏటా 25 లక్షల నుంచి 30లక్షల పైబడి ఎగుమతి చేసేవారు. జిల్లా నలుమూలల నుంచి మత్స్యకార సొసైటీల ప్రతినిధులు చెరువుల్లో వేసుకునేందుకు ఒక్కో సందర్భంలో క్యూ కట్టిన దాఖలాలు ఉన్నాయి. రాజోలు, ద్వారపూడి, మామిడికుదురు కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి ఉండేది. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈదరపల్లిలోని మత్స్య శాఖకు చెందిన చేప పిల్లల ట్యాంకుల స్థలాన్ని జగనన్న ఇళ్ల పట్టాల పేరిట మెరక పనులుచేసి పూడ్చేశారు. ప్రస్తుతం ఆ కేంద్రం వద్ద మూడు సిమెంటు తొట్టెలు మాత్రమే నిరుపయోగంగా మిగిలాయి. ఇక రాజోలులో గతంలో ఉన్న తొట్టెలను తొలగించి నూతనంగా నిర్మించేందుకు ముందుకు వచ్చినా ఆ పనులు ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదు. కొత్తపేటలో ఎనిమిది, మామిడికుదురులో మూడు, ద్వారపూడిలో ఎనిమిది చేప పిల్లల పెంపకం ట్యాంకులను నిరుపయోగంగా మార్చేశారు. కూటమి ప్రభుత్వం మత్స్య శాఖ ఆధ్వర్యంలో లెక్కలు తీస్తుండడంతో త్వరలోనే ఆయా కేంద్రాలన్నీ చేప పిల్లల పెంపకంతో కళకళలాడే అవకాశం ఉందని మత్స్యకారులు భావిస్తున్నారు.



ఈదరపల్లిలో మత్స్య శాఖ కార్యాలయం వెనుక ఇళ్ల స్థల పట్టాలుగా మారిన నాటి చేప పిల్లల పెంపకం కేంద్రం

ట్యాంకులను పునరుద్ధరించాలి

ధర్మాడి చినఏడుకొండలు
శ్రీరామ ఫిషర్‌మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు




మత్స్యకార సొసైటీల ద్వారా జిల్లాలోని పంచాయతీ చెరువులను ఏటా లీజుకు తీసుకుని చేపలను పెంచుతాం. గత ఐదేళ్లుగా చేప పిల్లల కోసం కైకలూరు, భీమవరం వంటి ప్రాంతాలకు వెళ్లి ప్రైవేటు కేంద్రాల నుంచి కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నాం. రవాణా ఖర్చులు పెరిగిపోతున్నాయి. ఒక్క కొత్తపేట, ముమ్మిడివరం, అమలాపురం ప్రాంతాల్లోనే 86 మత్స్యకార సొసైటీలు ఉన్నాయి. ఒక్కో సొసైటీ పరిధిలో 5 నుంచి 6 పంచాయతీల చెరువులను లీజుకు తీసుకుని చేపల సాగు చేసుకుంటున్నాం. గతంలో ఉన్న చేప పిల్లల పెంపకం కేంద్రాలను పునరుద్ధరించాలి.

పీఏసీఎస్‌ల్లో కంప్యూటరీకరణ నెలాఖరులోగా పూర్తి చేయాలి: కలెక్టర్



కంప్యూటరీకరణ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, ఆగస్టు 13: జిల్లాలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీల్లో కంప్యూటరైజేషన్ ప్రక్రియను ఈ నెల 31వ తేదీలోగా పూర్తిచేయాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలోని 166 పీఏసీఎస్‌లను 31లోగా కంప్యూటరీకరణ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కంప్యూటరైజేషన్‌లో భాగంగా డేటా క్యాప్చర్ టూల్ ద్వారా జిల్లాలోని పీఏసీఎస్‌ల్లో సభ్యుల వివరాలు, ఇచ్చిన రుణాలు, సొసైటీల ఆస్తుల తదితర వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచాలన్నారు. జిల్లాలో నాలుగు పీఏసీఎస్‌లు, పెట్రోల్ బంకులు నడిపేందుకు అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నట్టు తెలిపారు. కౌలు రైతులు పంట రుణాలు పొందేందుకు పడుతున్న ఇబ్బందుల నేపథ్యంలో సీసీఆర్సీ కార్డులు ఉన్న ప్రతి రైతుకూ పంట రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, జిల్లా సహకార అధికారి మురళీకృష్ణ, నాబార్డు జిల్లా డెవలప్‌మెంట్ మేనేజరు సోమినాయుడు, డీసీసీబీ ఈసీవో నరసింహారావు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న

గాంధీజీ చిత్రం

బ్రిటీషు వారిని ఎదురించి భారతదేశానికి స్వేచ్ఛా స్వాతంత్ర్యం తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు గాంధీజీ. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఈదరాడ హైస్కూలు డ్రాయింగ్ టీచరు బత్తుల శ్రీనివాస్ ఆయిల్ పెయింట్‌తో గీసిన మహాత్ముని చిత్రం ఆకట్టుకుంది. శ్రీనివాస్‌ను హెచ్ఎం జి.సాయిబాబుతో పాటు సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

\- మామిడికుదురు

చింతలమోరిలో 300 మీటర్ల జెండా ప్రదర్శన



చింతలమోరిలో భారీ జాతీయ జెండాను ఊరేగిస్తున్న విద్యార్థులు

మలికిపురం, ఆగస్టు 13: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం చింతలమోరిలో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ దొక్కా నాథ్‌బాబు ఆధ్వర్యంలో మంగళవారం హైస్కూలు విద్యార్థులు 300మీటర్ల జాతీయ జెండాతో ప్రదర్శన నిర్వహించారు. జాతీయతా భావాన్ని పెంపొందించడానికి ప్రధాని పిలుపు మేరకు కార్యక్రమం చేపట్టినట్టు నాగబాబు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎంపి వేమా, అడబాల సత్యనారాయణ, అడబాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

336 అడుగుల జాతీయ జెండాతో విద్యార్థుల ర్యాలీ



336 అడుగుల జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పెద్దాపురం, ఆగస్టు 13: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని కాకినాడజిల్లా పెద్దాపురంలో 336 అడుగుల జాతీయ జెండాను విద్యార్థులు మంగళవారం ప్రదర్శించారు. ఈ భారీ జెండాను పట్టణ వీధుల్లో ప్రదర్శిస్తూ ర్యాలీగా వెళ్లి స్థానిక మున్సిపల్ జంక్షన్‌వద్ద మానవహారంగా ఏర్పడి జాతీయజెండాను ప్రదర్శించారు. ఈ జెండా ప్రదర్శన కార్యక్రమంలో ఎస్ఐ మౌనిక పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతీఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలన్నారు.

ఇసుక కొరత తీరేదెప్పుడో?



- 17 డీసిల్టేషన్ ర్యాంపుల గుర్తింపు... ఇంకనూ లభించని అనుమతులు
- ఇరిగేషన్‌కు బ్యారేజీ నుంచి ఫోర్త్ బ్రిడ్జిలోపు ర్యాంపుల నిర్వహణ
- ఫోర్త్ బ్రిడ్జి అవతల మైన్స్‌కు అప్పగింత ● ఈ వారంలో మొదలు కానట్టేనా?
- ఇసుకకు వినియోగదారుల ఎదురుచూపు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఉచిత ఇసుక విధానాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి ప్రభుత్వం ప్రయత్నాలు ఆరంభించాయి. జూలై 8 నుంచి ఉచిత ఇసుక విధానం అమల్లోకి వచ్చినప్పటికీ, ఇంకా ఇసుక తీత మొదలు కాలేదు. గత ప్రభుత్వం హయాంలో నిబంధనలకు విరుద్ధంగా తవ్వేసి, మళ్లీ వాళ్ల ప్రభుత్వమే వస్తుందనే దురాశతో జిల్లాలో పలు చోట్ల ఇసుకను స్టాక్ చేసిన సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉచిత ఇసుక విధానం ప్రకటించి మొదట ఈస్టాక్ పాయింట్లలోని ఇసుకను సరఫరా చేశారు. జిల్లాలో ఇంచు మించు ఇసుక స్టాక్ అయిపోయినట్టే. రాజమహేంద్రవరం డివిజన్‌లో అసలు లేదు. కొవ్వూరు డివిజన్‌లో కూడా రేపోమాపో అంతా ఖాళీ. ఈ పరిస్థితులలో ఇసుక కొరత లేకుండా చూడాలని ప్రభుత్వం, జిల్లా ఇసుకకమిటీ ప్రయత్నాలు చేస్తోంది. కానీ నిబంధనలు అడ్డు వస్తున్నాయి. వీటిపై స్పష్టత రాగానే కొంతమేరైనా ఇసుక తీత తీసే అవకాశం ఉంది. ప్రస్తుతం వరద కారణంగా ఓపెన్ రీచ్‌ల జోలికి వెళ్లడంలేదు. ఇసుక కొరత లేకుండా చూడడం కోసం అఖండ గోదావరిలో డీసిల్టేషన్ ద్వారా ఇసుకతీసి సరఫరా చేయడానికి నిర్ణయించారు. రాజమహేంద్ర వరం, కొవ్వూరు ప్రాంతాల్లో మొత్తం 17డీసిల్టేషన్ పాయింట్లను గుర్తించారు. వీటిని ఎవరికి అప్పగించాలి, ఎవరితో ఎలా ఇసుక తీయించాలనే దానిపై స్పష్టతకు అధికారులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటివరకూ అందిన సమాచారం ప్రకారం ఈ పాయింట్లను క్లస్టర్లుగా విభజించి, ఆన్‌లైన్ టెండర్లు పిలవాలని చూస్తున్నారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి గోదావరి ఫోర్త్ బ్రిడ్జి అయిన గామన్‌బ్రిడ్జి వరకూ రాజమహేంద్రవరం, కొవ్వూరు ప్రాంతాల మధ్య అఖండగోదావరిలో డీసిల్టేషన్ పాయింట్ల ద్వారా ఇసుక టెండర్లు పిలవడం, తీయించడం, సరఫ రా చేయించే బాధ్యత ఇరిగేషన్ శాఖకు ప్రభుత్వం అప్పగించింది. గామన్ బ్రిడ్జి అవతల డీ సిల్టేషన్ పాయింట్ల నిర్వహణ బాధ్యతను మైన్స్ డిపార్ట్ మెంట్‌కు అప్పగించింది. గతంలో మాదిరిగా ర్యాంపులకింద కాకుండా రాజమ హేంద్రవరంఅర్బన్, రాజమహేంద్రవర రూరల్, వెంకటనగర్, వాడపల్లి, ఎర్రమ్మఘాట్, అరికిరేవుల, దొండగంటి రేవు, తాళ్లపూడి, ప్రక్కిలంక తదితర డీసిల్టేషన్ పాయింట్లను గుర్తించారు. గత వైసీపీ ప్రభుత్వ ఆధ్వర్యంలో రూ.268 కోట్ల విలువైన ఇసుక డ్రెడ్జింగ్ ఆర్డర్ పొందిన రాఘవా కన్‌స్ట్రక్షన్ కొనసాగించాలా, వద్దా అనే దానిపై కూడా స్పష్టత రాలేదని అధికారులు చెబుతున్నారు. ఈ కంపెనీకి అనుమతిస్తే డ్రెడ్జింగ్ ద్వారా కరవుతీరా ఇసుక తీసే అవకాశం ఉంది. అప్పట్లో అఖండ గోదావరిని డ్రెడ్జింగ్‌తో కుళ్లబొడిచి, పర్యావరణాన్ని దెబ్బతీసిన సంగతి తెలి సిందే. కనీసం ఎంత ఇసుక తవ్వారో, ఎంత అమ్మారో అనే బిల్లులులేకుండా చేశారు. కానీ ఇవాళ అసలు ఇసుక ను ఇరిగేషన్ ఆధ్వర్యంలో తీయించాలా, మైన్స్ ఆధ్వర్యంలో తీయించాలనే విష యం మీద పెద్ద చర్చ జరిగింది. అందుకే అన్ని నిబంధనలు పాటిస్తూ బ్యారేజీ నుంచి ఫోర్త్ బ్రిడ్జి వరకూ ఇరిగేషన్, తర్వాత మైన్స్‌తో పనిచేయ డానికి నిర్ణయించారు. గతంలో మైన్స్‌లేదు.. ఇరిగేషనూ లేదు. వైసీపీ ఇష్టానుసారం జరిగింది. ప్రభుత్వం నుంచి స్పష్టతరాగానే టెండర్లు పిలిచి ఇసుకతీత ప్రారంభించనున్నారు. ఈ వారం మధ్యలో రెండు పబ్లిక్ హాలీడేలు ఉండడంవల్ల వచ్చేవారం వరకూ ఇసుకతీత, సరఫరా ప్రారంభం కాకపోవచ్చు. కానీ రేపోమాపో ఆర్డర్ వస్తే కొంత త్వరగానే ప్రారంభించే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో భవన నిర్మాణదారులు కొంత ఓపిక పట్టాల్సిందే.

> ఇసుక కొరత ఇప్పుడే తీరేలా లేదు. నిబంధనల ప్రకారం ఏదైనా పని చేయాలంటే ఎంతకష్టమో ఈ ఇసుక విధానం చూసి అర్థం చేసుకోవచ్చు. గత ప్రభుత్వం నిబంధనలన్నీ తుంగలో తొక్కి, అధికా రుల నోటిపై వేలు పెట్టుకోమని బెదిరించి, ఇసుక ఇష్టానుసారం దోచేసి, అమ్ముకుని, రూ.కోట్లు గడించిన సంగతి తెలిసిందే. రూ.కో ట్లు అక్రమాలు జరిగినా ఒక్క అధికారి కూడా మాట్లాడలేదు. ఇవాళ తెలుగుదేశం ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేయడానికి అనేక నిబంధనలు తెరమీదకు వచ్చాయి. అధికారులు అనేక చట్టాలను వెలికితీసి చూపిస్తున్నారు. అన్ని అనుమతులు ఉంటేనేగానీ ఇసుక తీయలేమని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం కూడా అధికారుల మాటకు విలువ ఇచ్చే. ఒకటి రెండు రోజులు ఆలస్యమైనా పద్ధతి ప్రకారమే ఉచిత ఇసుక అమలు చేసి, ఎక్కడా ఎవరికీ అందలేదనే చెడు రాకుండా చూడాలని స్పష్టంచేస్తోంది.

కాకినాడ జేఎన్టీయూకు

101-150 ర్యాంక్ బ్యాండ్‌లో ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు

జేఎన్టీయూకే, ఆగస్టు 13: కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ విడుదలచేసిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)-2024 ర్యాంకింగ్స్‌లో కాకినాడ జేఎన్టీయూకే విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ విభాగంలో 101-150 ర్యాంక్‌బ్యాండ్‌లో ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు సాధించినట్లు ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన ఎన్ఐఆర్ఎఫ్‌లో మెరుగైన ర్యాంకు సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలను గూర్చి వివరించారు. గతేడాది ఎన్ఐఆర్ఎఫ్- 2023లో కూడా ర్యాంకింగ్స్‌లో వర్శిటీ 101-150 ర్యాంక్‌బ్యాండ్‌లో ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు సాధించిందన్నారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో 50-100 ర్యాంక్‌బ్యాండ్‌లో మెరుగైన ర్యాంకు సాధించేందుకు యూనివర్శిటీలోని రెగ్యులర్ అధ్యాపకులకు పూర్తిస్థాయి రీసెర్చ్ స్కాలర్‌ను కేటాయిస్తామని తెలిపారు. విదేశీ విద్యార్థుల ప్రవేశాలను మెరుగుపరిచేందుకు తగిన చర్యలు చేపడతామని, ఎంటెక్,పీహెచ్‌డీ వంటి ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులను మరింత ప్రోత్సహిస్తామని ఫ్యాకల్టీ స్టూడెంట్ రేషియోను పెంచేందుకు తగిన చర్యలు చేపడతామన్నారు. వర్శిటీలో చేపట్టే ప్రతీ కార్యక్రమంలోనూ లింగ సమానత్వాన్ని పాటించడం ద్వారా ఎన్ఐఆర్ఎఫ్‌లో మెరుగైన ర్యాంకు సాధించవచ్చని రిజిస్ట్రార్ వివరించారు.

బి.ప్రత్తిపాడులో విజిలెన్స్ అధికారుల తనిఖీ

- 31.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

పిఠాపురం రూరల్, ఆగస్టు 13: కాకినాడ జిల్లా పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడు గ్రామంలో మంగళవారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. వాహనం ద్వారా రేషన్‌బియ్యం తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు వ్యాన్‌లో తరలిస్తున్న 31.50 క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. రేషన్‌బియ్యం విలువ రూ.8.93లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. వాహనంలో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న ఆకుల గంగరాజుపై పిఠాపురం రూరల్ పోలీసుస్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేశారు. బియ్యాన్ని, వాహనాన్ని సీజ్ చేశారు. విజిలెన్స్ ఎస్పీ సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన తనిఖీల్లో ఎస్ఐ టి.జగన్నాథరెడ్డి, సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసీల్దారు ఎం.వీరాస్వామి, కానిస్టేబుల్స్ శివ, లోవరాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



వాహనంలో తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

కాకినాడ పోర్టులో

మరో రెండు చెక్‌పోస్టులు

- పోర్టు కార్మికులకు ఇబ్బంది లేకుండా చర్యలు
- అవినీతి కార్యక్రమాలు జరగకుండా ప్రక్షాళన
- పోర్టు కార్యకలాపాలకు ఇబ్బంది లేకుండా చర్యలు
- రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 13: రోజుకు వెయ్యి నుంచి పదకొండు వందల లారీల బియ్యం ఎగుమతులు అయ్యే విధంగా పోర్టులో మరో రెండు చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. కాకినాడ కలెక్టరేట్‌లో మంగళవారం పౌరసరఫరాల సంస్థ ఎండీ వీరపాండ్యన్, జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, కాకినాడ నగరం ఎమ్మెల్యే వనమాడి కొండబాబులతో కలిసి ఆయన కాకినాడ యాంకరేజ్ పోర్టు కార్యకలాపాలపై సమీక్షించారు. ఈసందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ కాకినాడ పోర్టులో రోజువారీ కార్యాకలాపాలకు ఇబ్బంది లేకుండా, కార్మికులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోర్టులో అవినీతి కార్యకలాపాలు జరుగకుండా ప్రక్షాళన చేస్తున్నామన్నారు. అదనంగా రెండు చెక్‌పోస్టులను ఏర్పాటు చేయడంతో పాటు టెక్నికల్ సిబ్బందిని నియమిస్తున్నామన్నారు. ఏ ఒక్కరిపై కక్ష లేకుండా కూటమి ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తుందన్నారు. పేదలకు ఆహార భద్రత కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా 1.45కోట్ల రేషన్‌కార్డుదారులకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కాకినాడ యాంకరేజ్ పోర్టును పూర్తిస్థాయిలో దుర్వినియోగం చేసిందన్నారు. పేదలకు చెందిన పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా రీసైక్లింగ్ చేసి విదేశాలకు తరలించారన్నారు. గతనెలలో జరిగిన దాడుల్లో 50వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీజ్ చేశామన్నారు. దీనిలో 26వేల మెట్రిక్ టన్నుల బియ్యం కెర్నెల్స్ కలిగిన పోర్టిఫైడ్ పీడీఎస్ బియ్యంగా గుర్తించామన్నారు. ప్రభుత్వం కిలో బియ్యం రూ.43కు కొనుగోలు చేసి లబ్ధిదారులకు ఉచితంగా ఇస్తూంటే ఆ బియ్యాన్ని బియ్యం మాఫియా కిలో ఏడు రూపాయలకు కొనుగోలుచేసి రీసైక్లింగ్ చేసి అక్రమంగా విదేశాలకు తరలిస్తున్నారని ధ్వజమెత్తారు. అక్రమంగా పీడీఎస్ బియ్యం కల్గిన 13 మందిపై 6ఏ కేసులతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేశారన్నారు. కాకినాడజిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ పోర్టులో కార్యకలాపాలు సక్రమంగా జరిగే విధంగా అన్నిచర్యలు తీసుకుంటున్నా మన్నారు. ఈనెల ఐదో తేదీన పోర్టులో చెక్‌పోస్టు ఏర్పాటు చేశామన్నారు. కాకినాడ నగరం ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ కాకినాడ పోర్టులో ఎగుమతులు, దిగుమతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. తొలుత కలెక్టరేట్‌లో పోర్టు అధికారులు, ఎగుమతిదారులు, లేబర్ యూనియన్లతో సమావేశమయ్యారు. అనంతరం కాకినాడ పోర్టు బొంబాయి గేటు వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్టును పరిశీలించారు. కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ రామ్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి ఎంవీ ప్రసాద్, డీసీ లీగల్ మెట్రాలజీ జనార్థనరావు, ఆర్డీవో కిషోర్, సివిల్ సప్లయిస్ డీఎం బాలసరస్వతి, కాకినాడపోర్టు అధికారి ధర్మశాస్త్ర, డీఎస్పీ హనుమంతురావు, పౌరసంబంధాలశాఖ డీడీ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



అవుట్ గేటు వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసేందుకు పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

అనుమానం.. పెనుభూతమై

భార్యను హత్య చేసిన భర్త

సీతానగరం మండలం పురుషోత్తపట్నంలో ఘటన

సీతానగరం, ఆగస్టు 13: ఆమె అందమే ఆమెకు శత్రువైంది. అనుమానపు భర్త చేతిలో హత్యకు కారణమైంది. సీతానగరం మండలం పురుషోత్తపట్నంలో మంగళవారం ఉదయం ఓ వ్యక్తి తన భార్యను దారుణంగా హత్యచేశాడు. స్థానికుల వివరాల ప్రకారం.. దేవీపట్నం మండలం దండంగి గ్రామానికి చెందిన చాట్ల జాను, అంగులూరుకు చెందిన దివ్య భారతి(30) భార్యాభర్తలు. వారికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం నేపథ్యంలో ప్రభుత్వం లోతట్టు గ్రామాల ప్రజలను ఖాళీ చేయించడంతో జాను కుటుంబం పురుషోత్తపట్నం వచ్చి ఓ కాలనీలో జీవనం సాగిస్తున్నారు. భారతి అందంగా ఉండడంతో మొదటి నుంచి జాను అనుమానం కలిగి ఉన్నాడు. ఈ క్రమంలో ఆమెను ఇబ్బందులకు గురిచేస్తుండడంతో గతంలో ఒకసారి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కొంతకాలం కోర్టులో నడిచింది. తరువాత పెద్దల మధ్య సర్దుబాటు చేసుకున్నారు. అయినప్పటికీ అనుమానం పోలేదు. భారతి తల్లి అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరగా సేవలు చేసేందుకు వెళతానని భర్తను కోరగా అందుకు ఒప్పుకోలేదు. అయినా తల్లిపై మమకారంతో ఆసుపత్రికి వెళ్లింది. దీంతో మళ్లీ ఇద్దరి మధ్య తగవు జరగడంతో విసిగిపోయిన భారతి తన భర్తతో జీవితం ఇలానే ఉంటుందని ఇక కాపురం చేయలేనని విడాకులకు ప్రయత్నాలు చేపట్టింది. దీంతో ఆగ్రహానికి గురైన జాను మంగళవారం ఉదయం తొర్రిగడ్డ పాత పంపింగ్ స్కీమ్ వద్ద బహిర్భూమికి వెళ్లిన భార్యపై పోటకత్తితో వెనుక నుంచి తల, మెడపై నిర్ధాక్షిణ్యంగా నరికి చంపాడు.ఈ ఘటనపై మృతురాలి తండ్రి సరిపల్లి చిట్టియ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ సమర్పణరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.



మృతిచెందిన దివ్య భారతి

కుంట ఎస్ఐ సస్పెన్షన్

- విలేకరులపై కుట్ర కోణమే కారణం!

చింతూరు, ఆగస్టు 13: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మాజిల్లా కుంట పోలీస్ స్టేషను ఎస్ఐ అజయ్ సోంకర్‌పై మంగళవారం కేసు నమోదైంది. వెనువెంటనే ఎస్ఐని సస్పెండ్ చేసినట్లు సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ గంగారావ్‌చౌవాన్ పేర్కొన్నారు. విలేకరులను గంజాయి కేసులో ఇరికించడం వెనుక ఎస్ఐ పాత్ర ఉందన్న ఆరోణలు వినవస్తున్నందున పూర్తిస్థాయి విచారణ జరిపిస్తున్నామని ఎస్పీ పేర్కొన్నారు. ముందుగా ఆరోపణలను ఎదుర్కొంటున్న ఎస్ఐని సస్పెండ్‌చేసి కేసు నమోదు చేశామన్నారు. అల్లూరిసీతారామరాజు జిల్లా చింతూరు పోలీసులు సోమవారం ఛత్తీస్‌గఢ్‌కు చెందిన నలుగురు వ్యక్తులను గంజాయి కేసులో నిందితులుగా పేర్కొంటూ అరెస్టు చేసిన విషయం విధితమే. కాగా అరెస్టు అయిన నలుగురు వ్యక్తులు కూడా ఛత్తీస్‌గఢ్‌లోని వివిధ పత్రికలకు విలేకరులుగా వ్యవహరిస్తున్నారు. విలేకరుల అరెస్టు వెనుక కుంట ఎస్ఐ కుట్ర కోణం దాగి ఉన్నదన్న ఆరోపణలు బలంగా విన్పిస్తున్నాయి. దీంతో ఛత్తీస్‌గఢ్‌లో జర్నలిస్టు సంఘాలు తీవ్ర నిరసనకు దిగాయి. అదే దశలో ఆ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్ళడం జరిగింది. ఇక జర్నలిస్టుల నిరసన గొంతుకు ఆ రాష్ట్ర ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం తన గొంతును కలిపింది. ఇటు మన రాష్ట్రంలో కూడా జర్నలిస్టు సంఘాలు విలేకరులపై అక్రమ కేసులు నమోదు చేయడం సరికాదంటూ నిరసన వ్యక్తం చేసింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు చేపట్టిన విచారణలో ఎస్ఐ పాత్ర, కుట్ర ఉందన్న విషయం స్పష్టమైన క్రమంలో కుట్రకు గల కారణాలు ఆ కుట్రలో ఎవరెవరు భాగస్వాములో కూడా తేటతెల్లమయ్యే పరిస్థితి లేకపోలేదన్న అభిప్రాయాలు వెల్లువెత్తుతున్నాయి.



సుక్మాలో విలేకరుల అక్రమ అరెస్టుని నిరసిస్తూ ఎస్ఐ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న జర్నలిస్టు సంఘాలు

అధికారుల నిర్లక్ష్యం

- నేటికీ బయటకురాని డ్రెడ్జింగ్ నావ
- గేటు మూయడానికి, సాఫ్ట్ లాక్ గేటు ఏర్పాటుకు అడ్డంకిగా మారిన బోటు
- నావ మునిగి 23 రోజులైనా పట్టించుకోని హెడ్‌వర్క్స్ ఈఈ.. ● బ్యారేజీలో తగ్గుతున్న నీరు
- మునిగిన పడవను పరిశీలించిన డెల్టా సీఈ, ఇరిగేషన్ ఎస్ఈ

ధవళేశ్వరం, ఆగస్టు 13: గోదావరి నీటిమట్టం పెరగడంతో లంగరు వేసిన ఇసుక డ్రెడ్జింగ్ నావ ప్రవాహానికి కొట్టుకు వచ్చి కాటన్ బ్యారేజ్ 1వ గేటును ఢీకొట్టి గేటుకు అడ్డంగా మునిగిపోయి 23 రోజులు గడిచినా ఇప్పటికీ నావ అలాగే మునిగి ఉంది. దానిని బయటకు తీయడానికి యజమాని రకరకాలుగా ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. గోదావరికి వరద ప్రవాహం పెరగడంతో ఇరిగేషన్ అధికారులు ప్రయత్నాలు నిలిపివేశారు. బ్యారేజీ గేటు వద్ద నావ మునిగి గేటును ఆపరేట్ చేయడానికి అడ్డంకిగా మారినా.. బ్యారేజ్‌ను పర్యవేక్షించాల్సిన హెడ్‌వర్క్స్ ఈఈ మొక్కుబడిగా ఆ ప్రాంతాన్ని పరిశీలించి వెళ్లిపోవడం గమనార్హం. ఈ సంఘటన కలెక్టర్ దృష్టికి వెళ్లి బ్యారేజ్ గేటుకు ఇబ్బంది రాకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించినా డివిజన్ అధిపతిగా సలహాలు, సూచనలు ఇస్తూ పర్యవేక్షించాల్సిన హెడ్‌వర్క్స్ ఈఈ బ్యారేజ్ సెక్షన్ ఏఈలకు నావను బయటకు తీయించే బాధ్యతను అప్పగించి చేతులు దులుపుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గోదావరిలో నీరు తగ్గుతూ ఉండటంతో గేట్లను దించి నీటి విడుదలను నియంత్రించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఏ విధంగానైనా అక్కడి నుంచి నావను తీయాల్సిన పరిస్థితుల్లో మంగళవారం ఉదయం డెల్టా సీఈ ఎన్.పుల్లారావు, సర్కిల్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు, ఇతర అధికారులతో కలిసి నావ మునిగిన ప్రాంతాన్ని పరిశీలించి నావను బయటకు తీయడానికి నావ ఓనర్‌కు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఏఈలకు సూచించారు. అలాగే నావను బుధవారం నాటికి బయటకు తీయని పక్షంలో ముక్కలుగా తీసి తొలగించాల్సి ఉంటుందని నావ యజమానులను హెచ్చరించారు.



బ్యారేజీ గేటు వద్ద మునిగిన నావను బయటకు తీయడానికి తీస్తున్న ప్రయత్నాలు



- అవగాహన లేని అధికారులతోనే తంటా

డెల్టాపై అవగాహన లేని అధికారులు డివిజన్లకు అధిపతులుగా రావడంతో వరదల సమయంలో తీసుకోవాల్సిన చర్యల్లో గందరగోళం నెలకొంటుంది. కాటన్ బ్యారేజీ గేట్ల నిర్వహణపై దృష్టిపెట్టకపోవడంతో వరదల సమయంలో గేట్లు మొరాయించిన పరిస్థితులు నెలకొంటున్నాయి

డీజిల్ ట్యాంకర్ నుంచి ఎగసిపడిన మంటలు

- ఆందోళనలో స్థానికులు, డ్రైవర్ పరార్
- అదుపుచేసిన అగ్నిమాపక దళాలు



ట్యాంకర్‌పై మంటలు అదుపుచేస్తున్న అగ్నిమాపక దళాలు

తాళ్లరేవు, ఆగస్టు 13: విశాఖపట్నం నుంచి యానాం వస్తున్న డీజిల్, పెట్రోల్ ట్యాంకర్ నుంచి ఒక్కసారిగా మంటలు ఎగసిపడటంతో మంగళవారం స్థానికులు భయాందోళనకు గురయ్యారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు అయ్యప్పస్వామిగుడి ప్రాంతం 216 జాతీయరహదారిపై ట్యాంకర్ వెనుక భాగంలో టైర్లుపేలిపోయి కాలిపోయి మంటలు ఎగసిపడ్డాయి. మంటలను గమనించిన ట్యాంకరు డ్రైవరు పరారై కోరింగ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆ ప్రాంతంలో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. కాకినాడ, జగన్నాధపురం, యానాం, రిలయన్స్ అగ్నిమాపక దళాలు సంఘటనా స్థలానికి చేరుకుని ఫోమ్ రసాయనంతో మంటలను అదుపు చేశాయి. ట్యాంకర్ సాంకేతిక లోపంవల్ల డీజిల్ వాహనం నుంచి భారీగా లీకైంది. దీంతో ప్రత్యామ్నాయంగా బొలేరా వాహనంలోకి డీజిల్‌ను కొంతవరకు తరలించారు. కోరింగ ఎస్ఐ సత్యనారాయణ 216రహదారిపై ట్రాఫిక్‌ను నిలివేసి ప్రయాణికులకు ఎటువంటి అంతరాయం కలుగకుండా తాళ్లరేవు మెయిన్‌రోడ్డుకు వాహనాలను మళ్లించారు. తాళ్లరేవు ఇరుకురోడ్డు కావడం అదే సమయానికి స్కూల్స్ వదలడంతో వాహనాలు ఇరుకురోడ్డులో ఎదురుపడి రాకపోకలు స్తంభించాయి. అగ్నిమాపక బృందాలు, కోరింగ పోలీసులు ఎటువంటి ప్రమాదం జరుగకుండా చర్యలు చేపట్టడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

రెండు వేర్వేరు కేసుల్లో 80 కేజీల గంజాయి పట్టివేత

మోతుగూడెం, ఆగస్టు 13: ఎస్పీ అమిత్‌బర్ద్ ఆదేశాలతో గంజాయి నిర్మూలనలో రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల ప్రణాళికలో భాగంగా మోతుగూడెం పీఎస్ పరిధిలో పోలీసులు విస్తృత వాహనాల తనిఖీలుచేసి రెండు వేర్వేరు కేసుల్లో 80 కేజీల గంజాయితో నలుగురు నిందితులను చేసి వారి వద్ద నుంచి రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మంనకు చెందిన పెంబుల ప్రశాంత్, మదిగొండ్ల మణి సందీప్‌లు 20కేజీల గంజాయి అక్రమంగా తరలిస్తుండగా మోతుగూడెం చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నారు. వారి వద్ద నుంచి ఒక స్కూటీ స్వాధీనం చేసుకున్నారు. ఒడిశాలోని నెమలపాలెం నుంచి భద్రాచలంనకు 60కేజీల గంజాయిని నెమలపాలెంనకు చెందిన నలుగురు వ్యక్తులు తరలిస్తుండగా మోతుగూడెం పోలీస్‌స్టేషన్ చెక్‌పోస్టువద్ద ఇద్దరు వ్యక్తులు ఒక బైక్ పట్టుకున్నారు. మరో ఇద్దరు బైక్‌పై పరారయ్యారు. ఈకేసులో వరుడు బంగారయ్యతో పాటు ఇంకొక వ్యక్తిని అరెస్ట్ చేశారు. రెండు కేసుల్లో రూ.4లక్షల విలువైన 80 కేజీల గంజాయిని పట్టుకున్నారు. చింతూరు సీఐ గజేంద్రకుమార్ మాట్లాడు తూ చింతూరు సర్కిల్ పరిధిలో విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామని, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణా పోలీసులు కో-ఆర్డినేషన్ చేసుకుంటూ గంజాయి నిర్మూలన చేపడతామని తెలిపారు. తప్పించుకున్న వారిని కూడా పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని, మిగతా వారిని రాష్ట్ర పోలీసులను సంప్రదించి పట్టుకుంటామని తెలిపారు. ఈ తనిఖీలో మోతుగూడెం ఎస్ఐ జి.గోపాలరావు, ఏఎస్ఐ సూర్యనారాయణరాజు, రాజేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ రాజు, శ్రీను, మురళి, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.



పోలీసుల అదుపులో గంజాయి నిందితులు

కొనసాగుతున్న రికార్డుల పరిశీలన

ద్రాక్షారామ, ఆగస్టు 13: ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి దేవస్థానంరికార్డులు పరిశీలన రెండో రోజు మంగళవారం కొనసాగింది. దేవదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనరు కె.సుబ్బారావు, ఉపకమిషనర్ ఎస్.ఎస్. చక్రధరరావు ఆధ్వర్యంలో అధికారుల బృందం రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈవో పి.టి.వి.సత్యనారాయణపై వచ్చిన ఫిర్యాదులపై రికార్డులను తనిఖీ చేస్తున్నారు.

మున్సిపల్ ఉద్యోగుల ర్యాలీ

యానాం, అగస్టు 13: డిమాండ్లు పరిష్కరించాలని మున్సిపల్ ఉద్యోగులు మంగళవారం యానాం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. బకాయి జీతాలు చెల్లించాలని, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని, డీపీటీ ద్వారా జీతాలు చెల్లించాలని కోరుతూ పరిపాలనాధికారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం పరిపాలనా ధికారి కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం పోలీసులు ఆందోళనను అడ్డుకున్నారు. దీక్షా శిబిరం ఆందోళన చేసుకోవాలని పోలీసులు సూచించారు. దీంతో పోలీసులు, మున్సిపల్ ఉద్యోగుల మధ్య కొంత సేపు వాగ్వివాదం చోటుచేసుకుంది. అనంతరం దీక్షా శిబిరం వద్ద ఉద్యోగులు ఆందోళన చేపట్టారు.

ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలి

మలికిపురం, ఆగస్టు 13: కొబ్బరి దింపు, ఒలుపు కార్మికుల సంక్షేమానికి ఒక ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని కొబ్బరి కార్మికుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డుపల్లి నాగేశ్వరరావు కోరారు. మంగళవారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కొబ్బరి రంగంపై వేలాది మంది జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. దింపు, ఒలుపు, నాడెం, మోత, సరుగుడు, పీచు, తాళ్ల ఎగుమతి, దిగుమతిపై వేలాదిగా జీవిస్తున్నారని వివరించారు. కార్మికుల అభివృద్ధికి ఒక ప్రత్యేక బోర్డు ఏర్పాటుచేసి 50ఏళ్లు దాటిన ప్రతీ ఒక్కరికీ పింఛను, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఈవిషయాలపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి కొబ్బరి బోర్డు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో పొలమూరి శ్యామ్ బాబు, చాగంటి స్వామి, కె.ప్రభాకరరెడ్డి తదితరులు ఉన్నారు.

తాటిపాక డైలీమార్కెట్ పరిశీలన

రాజోలు, ఆగస్టు 13: తాటిపాక డైలీ మార్కెట్‌ను ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాటిపాక డైలీ మార్కెట్ శిథిలావస్థకు చేరడంతో వాటి స్థానంలో నూతన షెడ్లను నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. తాటిపాక పంచాయతీకి డంపింగ్ యార్డు కొరత ఉందని, త్వరలోనే డంపింగ్ యార్డుకు స్థల సేకరణ చేస్తామన్నారు. అనంతరం చర్మకారులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా శ్రీను, సర్పంచ్ కోటిపల్లి రత్నమాల, రాజోలు మండల జనసేన పార్టీ అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాస్, రాజోలు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, మాజీ ఎంపీపీ పిల్లి శ్రీరామమూర్తి, గుండుబోగుల పెదకాపు, తాటిపాక ఉప సర్పంచ్ కటికిరెడ్డి బుజ్జి, గుండాబత్తుల తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు కుర్చీలు బహూకరణ

ఆత్రేయపురం, ఆగస్టు 13: మెర్లపాలెం 2,3 బులియ్యరేవు పాఠశాలలకు యూటీఎఫ్ ప్రధానకార్యదర్శి సుధాకర్‌బాబు తన తండ్రి జ్ఞాపకార్థం కుర్చీలను బహూకరించారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు వెంకటేష్ ఎంపిక



మామిడికుదురు, ఆగస్టు 13: కాకినాడలో ఈనెల11న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో జరిగిన తైక్వాండో పోటీల్లో మామిడికుదురు దీప్తి కళాశాల విద్యార్థి కడలి దివ్య తేజవెంకటేష్ బంగారు పతకం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు కళాశాల కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ తెలిపారు. ఈనెల17న విశాఖపట్నంలో రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతాయన్నారు. వెంకటేష్‌ను మంగళవారం కరస్పాండెంట్, కోచ్ కె.చిన్నా, మణికుమార్, అధ్యాపకులు అభినందించారు.

కుళాయి ద్వారా చేప పిల్లలు

ఆందోళనలో ప్రజలు




మామిడికుదురు, ఆగస్టు 13: కుళాయిల ద్వారా నెల రోజులుగా తరచూ మంచి నీటితో పాటు చేప పిల్లలు వస్తున్నాయని మామిడికుదురు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను అధికారులకు వివరించినా ఫలితం లేదని జనసేన నాయకుడు రుద్ర శ్రీను ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

శిథిలస్థితిలో మండల పరిషత్ కార్యాలయం

● పరిషత్ భవనం పిల్లర్ దెబ్బతిని స్లాబు పెచ్చులూడి
● స్లాబు పెచ్చులూడిన పాఠశాల భవనం



శిథిలస్థితికి చేరిన మండల పరిషత్ కార్యాలయం



పెచ్చులూడిన మండల పరిషత్ కార్యాలయం, పాఠశాల స్లాబ్స్

అల్లవరం, ఆగస్టు 13: 24ఏళ్ల క్రితం నిర్మించిన ఆ భవనాలు కాలం చెల్లి శిథిలావస్థకు చేరుకున్నాయి. పిల్లర్లు కుంగి, స్లాబు పెచ్చులూడి ఆ భవనాలు ప్రమాద భరితంగా మారాయి. అల్లవరం మండల పరిషత్ కార్యాలయ భవనం, బోడసకుర్రుపాలెం పాఠశాల భవనాలు శిథిలమై ప్రమాద భరితంగా మారాయి. స్వాతంత్ర్య సమరయోధుడు నడింపల్లి రామభద్రరాజు అల్లవరం మండల పరిషత్ కార్యాలయానికి స్థలదానం చేయగా 1998జనవరి 4న అప్పటి లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి అప్పట్లో ప్రారంభించారు. అడపా సుశీల మండల అధ్యక్షురాలు ఉం డగా రూ.2.75లక్షలతో మండల పరిషత్ భవనాన్ని నిర్మించారు. ఇదిఇప్పుడు పిల్లర్ దెబ్బతిని స్లాబు పెచ్చులూడి ప్రమాదాలకు నిలయంగా మారింది. 14రోజుల క్రితం కార్యాలయ వెనుక గుమ్మం వద్ద పెద్ద పెచ్చు ఊడిపడటంతో తృటిలో ప్రమాదం తప్పింది. 1994లో డొమ్మేటి వెంకటరెడ్డి కుటుంబ సభ్యుల సహకారంతో ప్రభుత్వ నిధులతో నిర్మించిన బోడసకుర్రుపాలెం ప్రాథమిక పాఠశాల భవనం ఊచలు బయటపడి పిల్లర్లు స్లాబు పాడై ప్రమాద భరితంగా మారింది. 50మంది విద్యార్థులు చదువుకునే ఈభవనం ఎప్పుడు కూలుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిషత్ భవనం పూర్తిగా పాడైందని, దానిని తొలగించి మరో కొత్త భవనాన్ని నిర్మించాల్సి ఉందని ఎంపీడీవో కృష్ణమోహన్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

బకాయిల విడుదలతో అన్నదాతల ఆనందం



కొత్తపేట, ఆగస్టు 13: గత ప్రభుత్వం రైతుల వద్ద సేకరించిన ధాన్యానికి పెట్టిన బకాయిలను కూటమి ప్రభుత్వం విడుదల చేసి అన్నదాతల కళ్లల్లో ఆనందం చూసిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రైతులకు ధాన్యం బకాయిలను విడుదల చేయడం ద్వారా తొలకరి పంట పనులకు ఆటంకం ఉండకపోవడంతో పాటు వారి పిల్లలు చదువులకు ఇబ్బంది ఉండదని గత అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించానన్నారు. కొత్తపేట నియోజకవర్గంలో 5,543మంది రైతులకు ధాన్యం బకాయిలు రూ.35.39కోట్లను ఖాతాల్లో జమ చేశామన్నారు.

అమ్మవారి పూజా ఘటాల ఊరేగింపు

అంబాజీపేట,ఆగస్టు13: నందంపూడి గ్రామదేవత శ్రీముత్యాలమ్మ అమ్మ వారి తీర్థ మహోత్సవంలో భాగంగా మంగళవారం కాపు సామాజిక వర్గీయుల ఆధ్వర్యంలో అమ్మవారి పూజఘటాన్ని పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు హారతులు ఇచ్చారు.

16నుంచి రెవెన్యూ సదస్సులు

ముమ్మిడివరం, ఆగస్టు 13: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు తహసీల్దార్ ఎంవీ సుబ్బలక్ష్మి పేర్కొన్నారు. 16న అన్నంపల్లి, 19న గాడిలంక, 21న కర్రివానిరేవు, 23న కొత్తలంక, 24న చినకొత్తలంక, 27న మర్లపాలెం, 29న కొమానపల్లి, సెప్టెంబరు 3 తేదీన గేదెల్లంక, 5న అయినాపురం, 6న ఠాణేలంక, 10న లంకాఫ్‌ఠాణేలంక, 12న కమిని, 13న సీహెచ్ గున్నేపల్లి, 17న అనాతవరం, 19న క్రాపచింతలపూడి, 20న పళ్లవారిపాలెం, 21న ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని రాయుడుపాలెం, 24న ముమ్మిడివరం నగర పంచాయతీ గొల్లలవీధి, 25న రాజుపాలెం సచివాలయం, 26న పల్లిపాలెం సచివాలయం, 27న సూరాయిచెరువు సచివాలయం, 28న బొండాయికోడు సచివాలయాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. సదస్సులో భూ సంబంధిత సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి ఆన్‌లైన్‌లో నమోదుచేసి రశీదు అందిస్తామని తెలిపారు.

అర్చకులకు వేతనం పెంపుపై హర్షం

కొత్తపేట, ఆగస్టు 13: చిన్న దేవాలయాల్లో ధూప, దీప, నైవైద్యాలకు ఎన్నో నైవేద్యాలకు ఎంతో ఇబ్బంది పడుతున్న అర్చకులకు వేతనాన్ని రూ.5వేలనుంచి రూ.10వేలకు పెంచడంపై దేవదాయ ఉద్యోగుల సంఘం మాజీ కార్యదర్శి దూనబోయిన నారాయణరావు హర్షం వ్యక్తం చేశారు. దీంతో అర్చకులు ఎంతో ఓదార్పు పొందుతారన్నారు.

హర్‌ఘర్ తిరంగా ర్యాలీ



యానాంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

అమలాపురంటౌన్, ఆగస్టు13: భారతీయ జనతా మహిళా మోర్చా ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులతో మంగళవారం హర్ ఘర్ తిరంగా యాత్ర నిర్వహించారు. పాఠశాల నుంచి గడియార స్తంభం సెంటరు వరకు చేపట్టిన ర్యాలీని కన్వీనర్ దొంగ గంగాభవానీ అధ్యక్షతన ప్రారంభించారు. కార్యక్రమంలో నారీశక్తి రాష్ట్ర కన్వీనర్ చిట్టూరి రాజేశ్వరి, బీజేపీ నాయకులు ఆర్వీ నాయుడు, మోకా వెంకటసుబ్బారావు, కొండేటి ఈశ్వర్‌గౌడ్, చిలకమర్రి కస్తూరి, మోకా ఆదిలక్ష్మి, బొంతు శివాజీ, హెచ్‌ఎం విజయకుమారి, జగతా శాంతి పాల్గొన్నారు.

రాయవరం: వెదురుపాక దోబీఘాట్ వద్ద మంగళవారం హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. తొలుత గ్రామంలో విద్యార్థులు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లిడి సూరారెడ్డి, టీడీపీ నేతలు కొవ్వూరి చంటిరెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి, వడ్డాది చిన్నకృష్ణం రాజు, కొవ్వూరి నాగిరెడ్డి, ఎన్ఆర్‌ఈజీఎస్ జేఈ కనక మహాలక్ష్మి, నాగలక్ష్మి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అంతర్వేది: బీజేపీ మండల అధ్యక్షుడు పట్టాపు సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో సఖినేటిపల్లిలో జాతీయ నాయకుల విగ్రహాలను శుభ్రంచేశారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస్‌నగేష్, రాష్ట్ర కిసాన్‌మోర్చా డ్రైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు మాట్లాడుతూ ప్రతీ ఇంటిపై, కార్యాలయాలపై జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కొణతం శ్రీనివాసరావు, ట్రెజరర్ నంబూరి వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు అల్లూరి సత్యనారాయణరాజు, ఇందుకూరి సుబ్బరాజు, ఆకన వెంకట్రావు పాల్గొన్నారు.

యానాం: స్వాతంత్ర్య వేడుకలు పురస్కరించుకుని యానాంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్‌ఏ కార్యాలయం ఎదుట పరిపాలనాధికారి మునిస్వామి, ఎస్పీ రాజశేఖరన్‌ను జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు వందలాది మంది జాతీయ జెండాలతో పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. భారతమాతకు జైఅంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, ఆరోగ్య శాఖ డీడీ టి.రవిశంకర్, విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్, ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ చింతపల్లి కృష్ణా సుధాకర్, ఎస్ఐ మురుగానందం, శేరు నూకరాజు పాల్గొన్నారు.

ద్రాక్షారామ: ద్రాక్షారామలో మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో విద్యార్థులు, బీజేపీ నాయకులు జెండాలతో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దూడల శంకరనారాయణ, బీజేపీ అనకాపల్లి ఇన్‌చార్జి కర్రి చిట్టిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ, పట్టణ అధ్యక్షుడు కేశవ రాఘవేంద్ర, యువ మోర్చా అధ్యక్షుడు తోలేటి సూర్యగంగాధర్, పట్టణ అధ్యక్షుడు రాయుడు మణికంఠ, పవన్, పెంటపాటి వీరబాబు, ఏలూరి సత్యపవన్ తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు: స్థానిక దీప్తి కళాశాల నుంచి విద్యార్థులు హర్‌ఘర్ తిరంగా ర్యాలీని మామిడికుదురు సెంటర్ వరకు నిర్వహించారు. హర్‌ఘర్ తిరంగా పి.గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పాలూరి జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ ప్రతీ పౌరుడు ఇంటిపై జాతీయజెండాను ఎగురవేయాలన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, మండల శాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ, నాయకులు అడబాల రాంబాబు, కంకిపాటి సుబ్బారావు, పసుపులేటి మహాలక్ష్మీరావు, బైరిశెట్టి రామకృష్ణ, అడపా వెంకటరత్నం, టీడీపీ నాయకులు ఈలి శ్రీనివాస్, జనసేన నాయకుడు మట్టా సత్తిబాబు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపదపై దృష్టి సారించాలి



అమలాపురం: శిక్షణలో పాల్గొన్న డీఎల్పీవో బొజ్జిరాజు

అమలాపురం రూరల్, ఆగస్టు 13: గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్యానికి అత్యధిక ప్రాధాన్యమివ్వాలని అమలాపురం డీఎల్పీవో పి.బొజ్జిరాజు కోరారు. ఇంటింటా సేకరించిన చెత్త నుంచి సంపదను సృష్టించడంపై దృష్టి సారించి తద్వారా పంచాయతీలు ఆర్థిక పరిపుష్టిసాధించాలన్నారు. మండల స్థాయిలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు రెండో రోజు శిక్షణను మంగళవారం పేరూరులోని సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ సెంటర్లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎల్పీవో చెత్త నుంచి సంపదను ఏవిధంగా సృష్టించవచ్చో వివరించారు. వివిధ విభాగాల్లో పంచాయతీల ఆర్థిక పరిపుష్టిపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో జి.మల్లికార్జునరావు, సర్పంచ్‌లు దాసరి అరుణ, పెనుమాల సునీత, నక్కా అరుణకుమారి, కార్యదర్శులు రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు, కట్టా సత్యబాబు, పరంశెట్టి ఆదినారాయణ, బి.అనంతసుబ్బలక్ష్మి, పరంశెట్టి శ్రీనివాస్‌పాల్గొన్నారు.

అంతర్వేది: ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు రెండో శిక్షణా తరగతులు నిర్వహించారు. తాగునీరు, రోడ్లు, పారిశుధ్యం, వీధిదీపాల నిర్వహణపై అవగాహన కల్పించినట్టు ఎంపీడీవో సత్యనారాయణతెలిపారు.

ద్రాక్షారామ: సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా తరగతులు మంగళవారం రెండో రోజు కొనసాగాయి. వెల్లలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద పారిశుధ్యం, చెత్త నిర్వహణ విధానం, వర్మికంపోస్టు, మార్కెటింగ్ విధానాలపై రిసోర్సుపర్సన్లు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.వి.రామచంద్రమూర్తి, ఈవోపీఆర్డీ ఎస్.షెలట్‌రాజు పాల్గొన్నారు.

అంబాజీపేట: చెత్త నుంచి సంపద తయారీపై సర్పంచ్‌లకు అవగాహన కల్పించారు. సర్పంచ్‌లు, కార్యదర్శులకు అందిస్తున్న శిక్షణలో భాగంగా మాచవరంలోని చెత్త సంపద కేంద్రాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. తడిచెత్త, పొడిచెత్త ద్వారా ఎరువుల తయారీ విధానంపై వివరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కొనసాగించారు. కార్యక్రమంలో ఎంపీపీ డొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో జీవీ సరోవర్, ఈవోపీర్డీ మమత, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: సర్పంచ్‌లకు ఇస్తున్న శిక్షణలో భాగంగా రెండో రోజైన మంగళవారం ర్యాలిలో సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్ల వద్ద క్లాప్ మిత్రలకు శిక్షణ ఇచ్చారు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేయగా వర్మీకంపోస్టు తయారీపై అవగాహన కల్పించారు. జడ్పీటీసీ సాయిబాబు, ఈవోపీ ఆర్డీ శ్రీనివాస్, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

అల్లవరం: తడి చెత్తతో వర్మీకంపోస్టు తయారీ కేంద్రాల నిర్వహణపై సర్పంచ్‌లు, కార్యదర్శులకు అధికారులు సూచనలు చేశారు. ఎరువు తయారీ, వాటి వల్లే కలిగే ప్రయోజనాలను వివరించారు. కొమరగిరిపట్నం పంచాయతీ పరిధిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని అధికారులు, సర్పంచ్‌లు పరిశీలించారు. ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్, ఈవోపీఆర్డీ ఎస్వీవీ సత్యనారాయణ, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు సాధనాల వెంకట్రావు, తిక్కిరెడ్డి శ్రీనివాస్, రాకాపు విజయలక్ష్మి, రొక్కాల విజయలక్ష్మి, తోట శ్రీదేవి, ఉంద్రు భగవాన్‌దాస్, చిట్నిడి శ్రీదేవి, మల్లాడి మంగాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: సర్పంచ్‌లకు, కార్యదర్శులకు ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం రెండో రోజు శిక్షణా తరగతులు ఎంపీపీ ఎంవీ సత్యవాణి అధ్యక్షతన జరిగింది. పారిశుధ్యం, చెత్త సేకరణ, వర్మి కంపోస్టు మార్కెటింగ్ తదితర అంశాలపై చర్చించారు. మేడిచర్లపాలెం చెత్త నుంచి సంపద కేంద్రం వద్ద ఘన, వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జి.శంకర్, ఎంపీడీవో మంగాదేవి, సుభాకర్, మిల్టన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు: ఆలమూరులో మంగళవారం సర్పంచ్‌లు, కార్యదర్శులకు రెండోరోజు శిక్షణా తరగతుల్లో చెత్త నుంచి సంపదపై శిక్షణ నిర్వహించారు. చెత్తను తేలికగా తీసుకోకుండా ఆదాయ మార్గాలను అన్వేషించాలని పలువురు వక్తలు సూచించారు. ఎంపీడీవో రోజ్‌మేరీ, ఈవోపీఆర్డీ రాజ్‌కుమార్, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రావులపాలెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు చెత్త నుంచి సంపద తయారీ ద్వారా పంచాయతీకి సమకూరే ఆదాయం, ప్లాస్టిక్ నిర్మూలనకు చేప ట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో ఎ.శ్రీని వాస్, ఈవోపీఆర్డీ జి.కృష్ణ, ఏవో జి.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు శిక్షణ రెండో రోజు మంగళవారం కొనసాగింది. గ్రామంలో సేకరించిన వ్యర్థాల నుంచి ఆదాయం పొందే పద్ధతులపై సర్పంచ్‌లకు అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో కొన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్న సంపద సృష్టి కేంద్రాల వద్ద ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ఎంపీడీవో కొరారి వెంకటేశ్వరప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లు దాసరి కృష్ణాజీ, వీధి సత్యనారాయణ, బడుగు సుమ, అనిత శిక్షణ ఇచ్చారు.

రాజోలు: అధికారులు,ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసినప్పుడే గ్రామాలుఅభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే దేవ రప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కేతా శ్రీను అధ్యక్షతన రెండో రోజు మంగళవారం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణా తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ఎంపీడీవో ఎన్.బాలాజీ, ఈవోపీఆర్డీ జి.భీమారావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ట్యాక్సీ యూనియన్ నూతన కార్యవర్గం



అమలాపురంటౌన్, ఆగస్టు13: స్థానిక సినిమా రోడ్డులో శ్రీలక్ష్మీగణపతి ట్యాక్సీ ఓనర్స్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాకుర్తి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగాబొక్కా గణేష్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా కొప్పిశెట్టి సాయిబాబు, సహాయకార్యదర్శిగా పందిరి సుధాకర్, కోశాధికారిగా నంద్యాల శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. కార్యవర్గాన్ని యూనియన్ సీనియర్ నాయకులు నల్లా దొరబాబు, తోట విశ్వేశ్వరరావు, కుడుపూడి నరసింహారావు, రవణం సుబ్బారావు, గారపాటి రామకృష్ణ అభినందించారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

ముమ్మిడివరం, ఆగస్టు 13: మద్యం తరలిస్తున్న ఇద్దర్ని అరెస్టు చేసినట్టు ఎస్ఐ జ్వాలసాగర్ తెలిపారు. అన్నంపల్లి తోల్‌గేట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా యానాం నుంచి ప్రయాణికుల ఆటోలో ఆరు మద్యం సీసాలను తీసుకువెళ్తున్న కృష్ణజిల్లా పెడనకు చెందిన బొడ్డు కిషోర్, బొడ్డు సురేష్ బాబులను అరెస్టు చేసినట్టు చెప్పారు. ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

గడ్డి మందు తాగిన వ్యక్తి మృతి

పి.గన్నవరం, ఆగస్టు13: ఉడిమూడి గ్రామానికి చెందిన అడబాల శివ(26) ఈనెల6న శివ పొలానికి వెళ్లి గడ్డి మందు తాగితే ఎలా ఉంటుందోననితాగి బయటకు ఊసేశాడు. ఈవిషయాన్ని ఇంట్లో చెప్పలేదు. ఈనెల12న ఆయాసం వచ్చి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో రాజమహేంద్రవరంలోని జీఎస్ఎల్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మంగళవారం ఉదయం మృతి చెందినట్టు ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: భవనమ్
శ్రీలలిత	: కమిటీ కుర్రోళ్లు
శేఖర్ స్ర్కీన్-1	: తుఫాన్
శేఖర్ స్ర్కీన్-2	: బడ్డీ
రమా	: రాయన్
గణపతి	: సూపర్ డీలక్స్
వెంకటపద్మావతిస్ర్కీన్-1	: కల్కి
వెంకటపద్మావతి స్ర్కీన్-2	: సింబా

16నుంచి విజయదుర్గా పీఠం 52వ వార్షికోత్సవాలు



రాయవరం, ఆగస్టు 13: వెదురుపాక విజయదుర్గా పీఠం 52వ వార్షికోత్సవ వేడుకలు ఈనెల16 నుంచి 18వరకు నిర్వహించనున్నట్టు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు తెలిపారు. మంగళవారం పీఠంలో అడ్మినిస్ట్రేటర్ మాట్లాడుతూ 16న కొల్హాపూర్ వేదపండితులతో శ్రీమహాలక్ష్మీ అమ్మవారికి తిరుమంజనం అర్చన, హోమం, సాయంత్రం 6.30గంటలకు తమిళనాడు రాష్ట్రం తిరుత్తణి వేదపండితులతో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి కల్యాణం నిర్వహిస్తారన్నారు. 17న ఉదయం అహోబిలం వేదపండితులతో లక్ష్మీనృసింహస్వామికి తిరుమంజనం, అర్చన, హోమం, సాయం త్రం పీఠంలో ఉన్న అనంతలక్ష్మి సమేత వీరవెంకట సత్యనారాయణస్వామి కల్యాణం జరుగుతుందన్నారు. 18న సీతారాముల పట్టాభిషేకం, సాయంత్రం వైఖానస పండితులతో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం జరుగుతుందన్నారు. సమావేశంలో విజయదుర్గా సేవాసమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, సత్యవెంకట కామేశ్వరి, బలిజేపల్లి రమ, పెద్దపాటి సత్యకనకదుర్గ, పీఠం పీఆర్వో బాబి తదితరులు పాల్గొన్నారు.

300మందికి గుండె పరీక్షలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు13: రామచంద్రపురంలో చిలుకూరిసేవా సమితి, రాధాకృష్ణ మెడికల్స్ ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడ స్వర సూపర్ స్పెషాలిటీస్ నేతృత్వంలో మెగా గుండె వైద్య శిబిరం నిర్వహించారు. 300మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరాన్ని మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం ప్రారంభించారు. కార్యక్రమంలో చిలుకూరి సేవా సమితి అధ్యక్షుడు చిలుకూరి సత్యనారాయణ, రామకృష్ణ, రాధాకృష్ణ మెడికల్స్ యజమాని అల్లక వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకుడు, మాజీ కౌన్సిలర్ అల్లం శ్రీనివాసు, జనసేన నాయకుడు గొల్లపల్లి కృష్ణ పాల్గొన్నారు.

మోదుకూరులో కోడి పందాలు

ఆలమూరు, ఆగస్టు 13: మోదుకూరులో మంగళవారం కోడిపందాలు నిర్వహించారు. శిబిరంపై ఆలమూరు పోలీసులు దాడి చేశారు. దాడిలో పలువుర్ని అదుపులోనికి తీసుకుని మోటార్‌సైకిళ్లు, కోళ్లు స్వాధీనం చేసుకున్నట్టు స్థానికుల సమాచారం. కోడిపందాలు కాకుండా పేకాట కేసులో నలుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకుని రూ.2900నగదు సీజ్ చేసినట్టు ఆలమూరు పోలీసులు వెల్లడించారు. కేసు మార్పు చర్చనీయాంశంగా మారింది.

ఎలక్ట్రానిక్ మీడియా కార్యవర్గం ఎన్నిక

అమలాపురం టౌన్, ఆగస్టు 13: అమలాపురం ప్రెస్‌క్లబ్ ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గాన్ని మంగళవారం ప్రెస్ క్లబ్ కార్యాలయంలో అడహక్ కమిటీ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా మహ్మద్‌బషీర్, ప్రధాన కార్యదర్శిగా కాకర సుధీర్, ఉపాధ్యక్షునిగా పొట్టుపోతు నాగేశ్వరరావు (నాగు), కోశాధికారిగా ఎస్వీఎస్‌హెచ్ హరిప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా మామిడిశెట్టి విష్ణుప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శిగా కడలి పల్లపరాజు, గౌరవాధ్యక్షుడిగా చొల్లంగి అప్పాజీ, సభ్యులుగా పరమట భీమామహేష్, గణపవరపు వీర వెంకట సత్యసాయిప్రసాద్, అద్దంకి సత్యభాస్కరరావు, డొమ్మేటి వెంకట్, హుస్సేన్ (రాజా), ఆసు భరత్‌రామ్ ఎన్నికయ్యారు. అడహక్ కమిటీ సభ్యులు కొర్లపాటి ప్రదీప్‌కుమార్, చొల్లంగి శేఖర్‌బాబు, టీకే విశ్వనాథ్, పిండి శేషు ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు.

ఆకట్టుకున్న ఇంద్రజాల ప్రదర్శన

ఆత్రేయపురం, ఆగస్టు13: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ర్యాలి మ్యాజిక్‌హౌస్‌లో మంగళవారం నిర్వహించిన ఇంద్రజాల ప్రదర్శన అలరించింది. నాలుగేళ్ల బాలుడు 78 జాతీయ జెండాలను సృష్టించి దేశభక్తి చాటుకున్నాడు. హిం దూ వస్త్రధారణ, భారతీయుడు వేషధారణ ఆకట్టుకున్నాయి.

వెంకన్న ఆదాయం రూ.1.67లక్షలు

ఆత్రేయపురం, ఆగస్టు 13: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఆదాయం రూ.1,67,384 లభించినట్టు ఈవో కిషోర్‌కుమార్ తెలిపారు.

ఓఎన్జీసీ ఈడీతో మల్లాడి భేటీ



యానాం, అగస్టు 13: కాకినాడ ఓఎన్జీసీ ఈడీతో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సమావేశమయ్యారు. మత్స్యకారులకు రావలసిన నష్టపరిహారం, సీఎస్ఆర్ నిధులతో చేపటాల్సిన అభివృద్ధి పనులు, గ్రంథాలయాల్లో పుస్తకాలు ఏర్పాటు తదితర పెండింగ్ అంశాలపై చర్చించారు. పరిపాలనాధికారి మునిస్వామి, మత్స్యశాఖ ఏడీ దడల గోంతియ్య, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి

మామిడికుదురు, ఆగస్టు 13: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ ఈనెల21న తలపెట్టిన భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని మాలమహానాడు సమావేశం పిలుపు ఇచ్చింది. మామిడికుదురు ఎస్సీ సామాజిక భవనంలో మంగళవారం జరిగిన సమావేశంలో నాలుగు మండలాల నాయకులతో కోర్ కమిటీని ఎన్నుకున్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో నల్లి శ్రీనివాస్, బొంతు మణిరాజు, కలిగితి పల్లంరాజు, బత్తుల మురళీకృష్ణ, నెల్లి దుర్గాప్రసాద్, చిలకపాటి శ్రీధర్, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్‌పాస్‌లు పంపిణీ

రాయవరం, ఆగస్టు 13: రాయవరం శ్రీరామయ్య జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు 172మందికి మంగళవారం పాఠశాల పూర్వ విద్యార్థి చెరుకూరి వీరవెంకట సత్యనారాయణమూర్తి సమకూర్చిన బస్‌పాస్‌లను లొల్ల సర్పంచ్ చాట్రాతి జానకిరాంబాబు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీ చైర్మన్ దేవిశెట్టి కోటేశ్వరరావు, టీడీపీ నేత వుండవిల్లి రాంబాబు, జయకృష్ణ, ఆర్టీసీ ఉద్యోగులు, సూరిబాబు, వాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓపెన్‌స్కూల్ అడ్మిషన్లకు గడువు పెంపు

అంబాజీపేట, ఆగస్టు 13: ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్‌కు సంబంధించి స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఇంటర్మీడియట్, పదో తరగతి అడ్మిషన్లకు ఈనెల20 వరకు గడువు ఉందని నిర్వాహకుడు నందిక వెంకటేశ్వరరావు తెలిపారు. వివరాలకు సెల్:9912703454ను సంప్రదించాలన్నారు.

వాహనచోదకులు హెల్మెట్ ధరించాలి

ఆత్రేయపురం, ఆగస్టు 13: మోటారు సైకిళ్లపై వెళ్లే వారు విధిగా హెల్మెట్ ధరించాలని సీఐ విద్యాసాగర్ కోరారు. మంగళవారం ఆయన లొల్ల లాకుల వద్ద వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ పెట్టుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను, బైక్ నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వాహనచోదకులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన సీఐకు సత్కారం

ముమ్మిడివరం, ఆగస్టు 13: విధి నిర్వహణలో సేవాభావంతో సేవలు అందించిన వారికి ప్రజల్లో గుర్తింపు ఉంటుందని ముమ్మిడివరం సీఐ మోహన్ కుమార్ పేర్కొన్నారు. ముమ్మిడివరం సీఐగా పనిచేసి బదిలీపై వెళ్లిన ఎస్.కొండయ్యకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కన్వెన్షన్ హాలులో దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సత్కరించారు. సీఐ కొండయ్య దంపతులను నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ మోహన్‌కుమార్, మూడు పోలీసుస్టేషన్ల పరిధిలోని ఎస్ఐలు దుశ్శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చెల్లి అశోక్, జొన్నాడ రాజారావు, కాశి మూర్తి, కాశి లాజర్, రాహుల్, జేమ్స్‌పాల్, సత్యనారాయణలతో పాటు ముమ్మిడివరం ఎస్ఐ జ్వాలాసాగర్, స్టేషన్ సిబ్బంది, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

ఆక్వా చెరువుల వద్ద దొంగతనాలు

ముగ్గురు యువకులను రైతులు పట్టుకుని పోలీసులకు అప్పగింత

అల్లవరం, ఆగస్టు13: ఆక్వా చెరువువద్ద విద్యుత్ రాగితీగలు దొంగలించి వెళ్తుండగా ముగ్గురు యువకులను గ్రామస్తులు పట్టుకుని మంగళవారం పోలీసులకు అప్పగించారు. ఇటీవల రొయ్యల చెరువుల వద్ద మోటార్లు, రేడియేటర్ల తీగలు, బ్యాటరీలు, దొంగతనాలకు చోరీ అవుతున్నాయి. దీంతో రైతులు నిఘా పెట్టారు. తూర్పులంక చెరువుల వద్ద రాగి తీగలు దొంగిలించి పారిపోతున్న ముగ్గురు యువకులను రైతులు, గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. యువకుల దొంగతనాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

అమలాపురం టౌన్, ఆగస్టు 13: స్థానిక హోటల్లో పనిచేస్తున్న వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. అల్లవరం మండలం కొమరగిరిపట్నానికి చెందిన పులిదిండి సత్యనారాయణ(50) పదేళ్లుగా అమలాపురం గడియార స్తంభం సెంటర్లోని పుల్లయ్య హోటల్‌లో పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి ఏడు గంటలకు నీరసంగా ఉందని హోటల్ వెనుక భాగంలోనే పడుకున్నాడు. మంగళవారం ఉదయం వచ్చి చూసేసరికి సత్యనారాయణ మృతి చెందినట్టు హోటల్ నిర్వాహకులు గుర్తించారు. పట్టణ సీఐ కె.క్రిస్టఫర్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అతడు కొంత కాలంగా హృదయ సంబంధ వ్యాధితో బాధపడుతున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. అతడి కుమారుడు గోవిందు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అతడికి భార్య, కుమారుడు ఉన్నారు.